సాక్షి జగిత్యాల

శుక్రవారం। 6। జూన్। 2025



కాంగ్రెస్ పెద్దలను కలిసిన విప్

జగిత్యాల/ధర్మపురి: మాదిగ ఎమ్మెల్యేలకు మంత్రివర్గ విస్తరణలో ప్రాధాన్యం కల్పించాలని ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ప్రధాన కార్యదర్శి కేసీ. వేణుగోపాల్‌ను కలిసి విన్నవించారు.



నృసింహుని సన్నిధిలో ఆర్డీవో

ధర్మపురి: శ్రీలక్ష్మీనృసింహస్వామిని కోరుట్ల ఆర్డీవో జివాకర్‌రెడ్డి దంపతులు దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు జరిపారు. ట్రస్టుబోర్డు సభ్యులు శేషవస్త్రం, ప్రసాదాలు అందించారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం 37.0/26.0

జిల్లాలో నేడు ఎండ తీవ్రత కొనసాగుతుంది. ఉక్కపోత ఉంటుంది. వేడిగాలులు వీస్తాయి. వర్షం కురిసే అవకాశం లేదు. రాత్రి ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి.

న్యూస్‌రీల్

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



మొక్కనాటి నీరు పోస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి రత్న పద్మావతి

జగిత్యాలజోన్: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని జిల్లా ప్రధాన న్యాయమూర్తి రత్న పద్మావతి పేర్కొన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా గురువారం జిల్లా కోర్టు ఆవరణలో న్యాయసేవా సంస్థ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్లాస్టిక్ వస్తువులు మానవ మనుగడకు పెను భూతంగా మారాయని తెలిపారు. పర్యావరణాన్ని సమతుల్యంగా ఉంచకపోవడంతోనే, అతివృష్టి, అనావృష్టి, అధిక ఉష్ణోగ్రతలు, అకాల వర్షాలు సంభవిస్తున్నాయని అన్నారు. జిల్లా మొదటి అదనపు జడ్జి సుగళి నారాయణ, సబ్ జడ్జి శర్మ, ఏజీపీ ఓంప్రకాశ్, పీపీ మల్లికార్జున్, జిల్లా లీగల్ ఎయిడ్ డిఫెన్స్ చీఫ్ కటుకం చంద్రమోహన్, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ అసిస్టెంట్ చీఫ్ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

అందరూ మొక్కలు నాటాలి



మొక్కకు నీరుపోస్తున్న మెజిస్ట్రేట్లు

మెట్‌పల్లి: పర్యావరణ పరిరక్షణకు అందరూ కృషి చేయాలని సీనియర్ సివిల్ మెజిస్ట్రేట్ నాగేశ్వర్‌రావు పేర్కొన్నారు. పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని అటవీశాఖ ఆధ్వర్యంలో గురువారం కోర్టు ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. జూనియర్ సివిల్ మెజిస్ట్రేట్ అరుణ్‌కుమార్‌తో కలిసి మొక్కలు నాటారు. ఎన్నో రకాల అనర్థాల వల్ల పర్యావరణం దెబ్బతింటోందన్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని పెద్ద సంఖ్యలో మొక్కలు పెంచాల్సిన అవసరముందన్నారు. జిల్లా అటవీ శాఖ అధికారి రవి ప్రసాద్, ఎఫ్‌ఆర్‌వో షౌకత్ అలీ, డిప్యూటీ ఎఫ్‌ఆర్‌వోలు సురేశ్ కుమార్, చైతన్యశ్రీ, న్యాయవాదులు తొగిటి రాజశేఖర్, పసునూరి శ్రీనివాస్, రాందాస్ పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను కలిగి ఉండాలి



మాట్లాడుతున్న జిల్లా న్యాయసేవా సంస్థ కార్యదర్శి శర్మ

జగిత్యాలజోన్: విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను కలిగి ఉండాలని జిల్లా న్యాయసేవా సంస్థ కార్యదర్శి వెంకట సుబ్రహ్మణ్య శర్మ సూచించారు. జిల్లా కేంద్రంలోని బాలసదన్‌ను గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతీ విద్యార్థి లక్ష్యం ఏర్పర్చుకుని, సాధించే వరకు కృషి చేయాలని అన్నారు. చాలామంది సమయం వృథా చేయడంతో అనుకున్న లక్ష్యాలను అందుకోలేక పోతున్నారన్నారు. విద్యార్థి దశలో కష్టపడితే జీవితాంతం సుఖంగా ఉండే అవకాశం ఉంటుందన్నారు. బాలసదన్‌లో అందుతున్న సౌకర్యాల గురించి నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. జిల్లా లీగల్ ఎయిడ్ డిఫెన్స్ చీఫ్ కటుకం చంద్రమోహన్, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సభ్యులు సతీశ్, విజయ్‌కుమార్‌లు పాల్గొన్నారు.

హైకోర్టుకు తరలిన జగిత్యాల న్యాయవాదులు



హైకోర్టుకు వెళ్లిన జగిత్యాల బార్ అసోసియేషన్ సభ్యులు

జగిత్యాలజోన్: జగిత్యాల బార్ అసోసియేషన్‌కు చెందిన న్యాయవాదులు తమ సమస్యల పరిష్కారం కోసం గురువారం హైకోర్టుకు వెళ్లి జడ్జీలను కలిశారు. కోర్టులో క్యాంటీన్, ఫ్యామిలీ కోర్టు, ఎస్సీ, ఎస్టీ అదనపు కోర్టుల ఏర్పాటు వంటి సమస్యలపై వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడు కాసుగంటి లక్ష్మణ్‌కుమార్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రాచకొండ శ్రీరాములు, ప్రధాన కార్యదర్శి అందె మారుతి, మెట్‌పల్లి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులు రాంచందర్, రమేశ్ పాల్గొన్నారు.



గంగమ్మకు పూజలు

ధర్మపురి: ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో గంగామాత నవరాత్రోత్సవాలు గురువారం ముగిశాయి. గంగమ్మ జన్మించిన రోజు సందర్భంగా నృసింహస్వామి ఆలయం నుంచి గోదావరి నది వరకు మేళతాళాలు, మంగళ వాయిద్యాలతో తరలివెళ్లారు. గోదారమ్మకు విశేష పూజలు నిర్వహించారు. అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించి, సప్త హారతులిచ్చారు. ఈ కార్యక్రమంలో ఈవో శ్రీనివాస్, ట్రస్ట్‌బోర్డు చైర్మన్ జక్కు రవీందర్, వేదపండితులు బొజ్జ రమేశ్ శర్మ, సంపత్‌శర్మ పాల్గొన్నారు.



పోచమ్మకు బోనాలు

కోరుట్ల రూరల్: కోరుట్ల మండలంలోని పైడిమడుగు గ్రామంలో గురువారం పోచమ్మకు ఘనంగా బోనాలు సమర్పించారు. గ్రామ దేవత పోచమ్మ పునః ప్రతిష్ఠాపన ఉత్సవాల్లో భాగంగా భక్తులు బోనాలతో ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. డప్పు చప్పుళ్లు, పోతురాజుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి.



అంజన్నకు హారతులు

జగిత్యాలరూరల్: జగిత్యాల మండలంలోని మోరపల్లి గ్రామంలో హనుమాన్ ఆలయం పునర్‌నిర్మాణానికి గురువారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మహిళలు పెద్దఎత్తున ప్రధాన వీధుల గుండా మంగళహారతులతో వచ్చి, భూమిపూజ కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు, హోమం నిర్వహించారు.

ఫిట్‌గా ఉన్నాయా?

- ప్రైవేటు విద్యాసంస్థల వాహనాలపై రవాణాశాఖ దృష్టి
- కొనసాగుతున్న వాహన సామర్థ్య పరీక్షలు
- రోడ్డెక్కాలంటే ఫిట్‌నెస్ తప్పనిసరి
- నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టరీత్యా చర్యలు
- జిల్లాలో 507 ప్రైవేటు విద్యాసంస్థల వాహనాలు



పాఠశాల బస్సుల ఫిట్‌నెస్‌ను పరీక్షిస్తున్న రవాణాశాఖ అధికారులు

జగిత్యాలక్రైం:

వేసవి సెలవుల అనంతరం మరోవారం రోజుల్లో పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి. ప్రైవేటు పాఠశాలల విద్యార్థులను వాహనాల్లో ఇంటి నుంచి తీసుకెళ్లి సాయంత్రం దింపేస్తుంటారు. చిన్నారులను తీసుకెళ్లే వాహనాలు ఫిట్‌గా ఉండాలనే ప్రభుత్వ నిబంధనల మేరకు విద్యాసంస్థల ప్రారంభానికి ముందు రవాణాశాఖ అధికారులు ఫిట్‌నెస్ పరీక్షలు నిర్వహిస్తుంటారు. అన్ని సరిగా ఉంటే రోడ్డెక్కేందుకు అనుమతి పత్రం జారీ చేస్తారు. జిల్లా రవాణాశాఖ కార్యాలయంలో వాహనాల ఫిట్‌నెస్ పరీక్షలు కొనసాగుతున్నాయి. జిల్లావ్యాప్తంగా వివిధ విద్యాసంస్థలకు చెందిన వాహనాలు 507 ఉండగా.. బుధవారం వరకు 201 వాహనాలకు ఫిట్‌నెస్ పరీక్షలు నిర్వహించారు. మరో 306 వాహనాలు ఫిట్‌నెస్ పరీక్షలకు రావాల్సి ఉందని రవాణాశాఖ అధికారులు వెల్లడించారు. 15 ఏళ్లు దాటిన బస్సులకు ఫిట్‌నెస్ ఇచ్చేందుకు నిరాకరిస్తున్నారు.

ఫిట్‌నెస్ తప్పనిసరి

గడువులోపు ప్రైవేటు పాఠశాలల బస్సులకు పాఠశాల యాజమాన్యాలు విధిగా ఫిట్‌నెస్ పరీక్షలు చేయించాలి. జగిత్యాల రూరల్ మండలం తాటిపల్లిలో ఉన్న జిల్లా రవాణాశాఖ కార్యాలయంలో ఇప్పటి వరకు 201 వాహనాలకు ఫిట్‌నెస్ పరీక్షలు నిర్వహించామని అధికారులు తెలిపారు. గతేడాది ప్రైవేటు విద్యాసంస్థలకు చెందిన బస్సుల ఫిట్‌నెస్ గడువు ముగిసింది. పాఠశాలలు తిరిగి ప్రారంభం కానుండటంతో ఫిట్‌నెస్ ఉంటేనే వాహనాలను రోడ్లపై తిప్పాలని, అతిక్రమిస్తే సీజ్ చేస్తామని రవాణాశాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు.

ఇవీ నిబంధనలు

పాఠశాల బస్సు 15ఏళ్ల కాలపరిమితి దాటకూడదు. విద్యాసంస్థల వాహనాలు పసుపు రంగులోనే ఉండాలి. డ్రైవర్‌కు హెవీ వెహికిల్ లైసెన్స్ ఉండాలి. వయస్సు 60ఏళ్లలోపు ఉండాలి. ఐదేళ్ల అనుభవం ఉండాలి. బస్సుపై కుడి ఎడమ వైపు పాఠశాల పేరు, చిరునామా స్పష్టంగా రాయాలి. వాహనం ఆగితే బ్లింక్ అయ్యేలా పైభాగంలో నాలుగు వైపులా అంబర్ లైట్లు ఉండాలి. బస్సులో ప్రథమ చికిత్స పెట్టె, మంటలను ఆర్పే వ్యవస్థ ఉండాలి. కిటికీలకు అడ్డంగా మూడు కడ్డీలు ఉండాలి. నేల నుంచి 325 మిమీ ఎత్తులో మెట్లు, ఎక్కేందుకు హ్యాండ్ రెయిలింగ్ ఉండాలి. అత్యవసర ద్వారం, బస్సు డ్రైవర్, అటెండర్ ఫోన్ నంబర్లు విధిగా ఉండాలి. డ్రైవర్‌కు బీపీ, షుగర్, కంటి పరీక్షలను చేయించాలి. సీరియల్ నంబర్‌తో కూడిన ఫిర్యాదుల పుస్తకాన్ని అందుబాటులో ఉంచాలి. టీఎస్ స్కూల్ యాప్ ద్వారా విద్యా సంస్థ పేరు, డ్రైవర్, అటెండర్ పేరు వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేసి స్కూల్‌యాప్‌లో పొందుపర్చాలి.

నిబంధనలు పాటించాలి



పాఠశాలలు, కళాశాలల యజమానులు నిబంధనలు పాటించాలి. బస్సులకు విధిగా ఫిట్‌నెస్ పరీక్షలు చేయించుకోవాలి. ఫిట్‌నెస్ లేకుండా పాఠశాల బస్సులు రోడ్లపై తిరిగితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటాం. కాలం చెల్లిన బస్సులను రోడ్లపై తిప్పరాదు. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు చేపడతాం.

– భద్రునాయక్, జిల్లా రవాణాశాఖ అధికారి

‘గిరి’ గ్రామాలకు మహర్దశ

- పీవీటీజీ స్కీంలో బోర్నపల్లి, దావన్‌పల్లి ఎంపిక
- కేంద్రం నుంచి ప్రత్యేక నిధులు
- ఈనెల 15 నుంచి 30వరకు ప్రత్యేక గ్రామసభలు



బోర్నపల్లి గ్రామ పంచాయతీ

రాయికల్:(జగిత్యాల): కేంద్ర ప్రభుత్వం గిరిజన గ్రామాల అభివృద్ధికి పీవీటీజీ స్కీం తీసుకొచ్చింది. జిల్లాలోని రాయికల్ మండలం బోర్నపల్లి, దావన్‌పల్లి గ్రామాలను ఈ స్కీం కింద ఎంపిక చేసింది. ఈ గ్రామాలను ఐదేళ్లపాటు కేంద్ర ప్రభుత్వం దతత్త తీసుకొని, ప్రత్యేక నిధులు కేటాయించడంతో పాటు వసతుల కల్పనకు మొదటి ప్రాధాన్యం ఇవ్వనుంది. ఈ రెండు గ్రామాల్లో రాష్ట్రం నుంచి వచ్చే నిధులతో పాటు కేంద్రం నిధులతో మరింత అభివృద్ధికి అవకాశం ఉంటుంది.

ఈ నెల 15నుంచి ప్రత్యేక గ్రామసభలు

పీవీటీజీ స్కీం కింద ఎంపికైన బోర్నపల్లి, దావన్‌పల్లి గ్రామాల్లో కేంద్ర 15 శాఖల అధికారులు ఈ నెల 15వ తేదీ నుంచి 30వ తేదీ వరకు ప్రత్యేకం గ్రామసభలు నిర్వహిస్తారు. అర్హులైన గిరిజనులకు పూర్తిస్థాయిలో ప్రభుత్వ పథకాలు వర్తించేలా నివేదిక తయారు చేసి కేంద్రానికి పంపిస్తారు. గ్రామంలో అంగన్‌వాడీకేంద్రాల్లో ఎంత మంది చిన్నారులు ఉన్నారు..? ఎందరికి ఆధార్‌కార్డులు, రేషన్‌కార్డులు, కిసాన్‌కార్డులు, జన్‌ధన్ అకౌంట్లు, కుల ధ్రువీకరణ పత్రాలు ఉన్నాయని ఆరా తీస్తారు. కేంద్రం నుంచి ఎంత మంది లబ్ధి పొందుతున్నారనే అంశాలు క్షుణ్ణంగా సేకరించి, నివేదిక తయారు చేయనున్నారు. జిల్లాలోని ఈ రెండు గ్రామాలకు కేంద్ర గిరిజన వ్యవహారాలశాఖ మంత్రి ద్వారా ఐదేళ్ల పాటు ప్రత్యేక నిధులు కేటాయిస్తారు. ఈ నిధులతో రోడ్లు, అంగన్‌వాడీ భవనాలు, ఆసుపత్రి భవనాలు, హాస్టళ్లు, తాగు నీటి సౌకర్యం కల్పిస్తారు.

గ్రామాల అభివృద్ధే ధ్యేయం



బోర్నపల్లి, దావన్‌పల్లి గ్రామాలను ప్రస్తుతం కేంద్ర పథకానికి ఎంపిక చేశాం. ఈ రెండు గ్రామాల్లో గిరిజనులు ఎక్కువగా ఉండటంతో ప్రాధాన్యం ఇచ్చాము. ముఖ్యంగా కేంద్రం ద్వారా వచ్చే నిధులతో గ్రామాలు అభివృద్ధి చెందడంతో పాటు గిరిజనులు ఆర్థికంగా ఎదుగుతారు.

– రాజ్‌కుమార్, జిల్లా డీటీడీవో

ప్రత్యేక క్యాంపులు ఏర్పాటు



ఈ రెండు గ్రామాల్లో ప్రత్యేకంగా వైద్యశాఖ ఆధ్వర్యంలో క్యాంపులు నిర్వహిస్తాం. ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బందితో సర్వే నిర్వహించి వివిధ వ్యాధులతో బాధపడుతున్న రోగుల సంఖ్య తెలుసుకొని మెరుగైన వైద్యసేవలు అందించేలా చూస్తాం.

– శ్రీనివాస్, డిప్యూటీ డీఎంహెచ్‌వో

మందులు అందుబాటులో ఉంచాలి

- డెంగీ, వైరల్ ఫీవర్లతో అప్రమత్తంగా ఉండాలి
- కలెక్టర్ సత్యప్రసాద్
- సారంగాపూర్ పీహెచ్‌సీ తనిఖీ



సారంగాపూర్ పీహెచ్‌సీలో రికార్డులు పరిశీలిస్తున్న కలెక్టర్ సత్యప్రసాద్

సారంగాపూర్: వర్షాకాలంలో వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలని, పీహెచ్‌సీలు, సీహెచ్‌సీల్లో వైరల్ ఫీవర్, డెంగీ వ్యాధులకు సంబంధించిన మందులు అందుబాటులో ఉంచుకోవాలని కలెక్టర్ సత్యప్రసాద్ ఆదేశించారు. సారంగాపూర్ ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఓపీ, ఇన్‌పేషెంట్లకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. ల్యాబ్ రికార్డులు, ఫార్మసీ వివరాలు పరిశీలించారు. రోగులకు అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్యకేంద్రంలో కాలంచెల్లిన మందులుంటే వెంటనే తొలగించాలని ఆదేశించారు. వర్షాకాలం నేపథ్యంలో వైరల్‌ఫీవర్, డెంగీ వ్యాధుల మందులు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. అనంతరం రంగపేట, బీర్‌పూర్ మండలం నర్సింహులపల్లె గ్రామంలో నిర్వహించిన భూభారతి సభలో పాల్గొని గ్రామసభలో వచ్చిన సాదాబైనామా, అసైన్‌మెంట్ భూముల అమ్మకాలు, కొనుగోళ్లు, విరాసత్ దరఖాస్తులను పరిశీలించారు. ప్రజలు అందించే ప్రతి దరఖాస్తును పరిష్కరించేలా చూస్తామని తెలిపారు. ఆర్డీవో మధుసూదన్, మాతాశిశు సంరక్షణాధికారి జయపాల్‌రెడ్డి, ఎంపీడీవో చౌడారపు గంగాధర్, ఎంపీవో సలీం, మండల వైద్యాధికారి రాధ, తహసీల్దార్లు వహీదొద్దీన్, సుజాత పాల్గొన్నారు.

తాత్కాలిక భవనాల పరిశీలన

కోరుట్ల రూరల్: కోరుట్లలో నవోదయ పాఠశాల ఏర్పాటుకు అనుమతులు మంజూరైన విషయం తెలిసిందే. పాఠశాల ఏర్పాటు చేసేందుకు కోరుట్లలోని మహిళా డిగ్రీ కళాశాల భవనాలను కలెక్టర్ బి.సత్యప్రసాద్ పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. సరైన ఏర్పాట్ల కోసం చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఆర్డీవో జీవాకర్‌రెడ్డి, తహసీల్దార్ కృష్ణ చైతన్య ఉన్నారు.

అభివృద్ధి పనులు పూర్తి చేయాలి

జగిత్యాల: గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ సత్యప్రసాద్ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో గ్రామీణాభివృద్ధిశాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. గ్రామాల్లో నిర్మిస్తున్న గ్రామపంచాయతీ భవనాలు, అంగన్‌వాడీస్కూళ్లు, టాయిలెట్స్, ప్రైమరీ హెల్త్ సెంటర్లు, సబ్ సెంటర్ల పనులు వేగవంతం చేయాలన్నారు. డీఆర్డీవో రఘువరణ్, పంచాయతీరాజ్ ఈఈ లక్ష్మణ్‌రావు పాల్గొన్నారు.

కోరుట్లకు ఉత్తమ పర్యావరణ పనితీరు అవార్డు



అవార్డు అందుకుంటున్న మున్సిపల్ కమిషనర్ మారుతి ప్రసాద్

కోరుట్ల: కోరుట్ల మున్సిపాలిటీకి టీజీపీసీబీ ఉత్తమ పర్యావరణ పనితీరు అవార్డు అందించింది. ప్రపంచ పర్యావరణ దినోత్సవంలో భాగంగా హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో తెలంగాణా పొల్యూషన్ కంట్రోల్ బోర్డు గురువారం ఈ అవార్డును మున్సిపల్ కమిషనర్ అందె మారుతీ ప్రసాద్‌కు అందజేసింది. మంత్రి కొండా సురేఖ, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు చైర్మన్ గుగ్లావత్ రవి అవార్డును అందించారు. మున్సిపల్ కమిషనర్ అందె మారుతీ ప్రసాద్ మాట్లాడుతూ.. పట్టణంలో చెత్త సేకరణ, వెహికిల్ ట్రాకింగ్ సిస్టం, తడి,పొడి చెత్తతో ఎరువు తయారీ, డీఆర్‌సీసీ సెంటర్ ద్వారా తడి, పొడి చెత్త వేరు చేయటం, పర్యావరణానికి హాని కలుగకుండా ప్లాస్టిక్ రహిత పట్టణంగా తీర్చిదిద్దేందుకు చేస్తున్న కృషిని గుర్తించి అవార్డుకు ఎంపిక చేసిందని తెలిపారు. పారిశుధ్య నిర్వహణ, పర్యావరణ పరిరక్షణకు సహకరిస్తున్న పట్టణ ప్రజలకు కమిషనర్ కృతజ్ఞతలు తెలిపారు.

పట్టణాల అభివృద్ధికి నిధులు

- జగిత్యాల మున్సిపాలిటీకి రూ.70 కోట్లు
- రాయికల్ బల్దియాకు రూ.15 కోట్లు మంజూరు



మొక్క నాటుతున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

జగిత్యాల/రాయికల్: జగిత్యాల మున్సిపాలిటీకి రూ.70 కోట్లు, రాయికల్ బల్దియాకు రూ.15 కోట్లు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ కావడంతో పట్టణాల అభివృద్ధికి నాంది పలుకుతోంది. రాష్ట్రంలో పలు మున్సిపాలిటీలకు నిధులు కేటాయించారు. జగిత్యాలకు రూ.20 కోట్లతో పాటు స్పెషల్ గ్రాంట్ కింద మరో రూ.50 కోట్లు కేటాయించారు. ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి జగిత్యాల, రాయికల్ మున్సిపాలిటీల అభివృద్ధికి నిధులు కేటాయించాలని కోరారు. దీంతో జగిత్యాలకు రూ.70 కోట్లు, రాయికల్‌కు సీడీఎంఏ నుంచి రూ.15 కోట్లు మంజూరైనట్లు ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ తెలిపారు. రోడ్లు, మురికికాలువలు, డివైడర్లు, పార్కులు, వసతుల కల్పన కోసం ఈ నిధులను వినియోగించనున్నట్లు పేర్కొన్నారు. దీని కోసం ప్రతిపాదనలు పంపించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. గతంలో జగిత్యాల మున్సిపాలిటీలో మోతె, తిప్పన్నపేట, శంకులపల్లి, హస్నాబాద్, ధరూర్, గోవిందుపల్లి విలీనమయ్యాయి. తాజాగా నూకపల్లి డబుల్‌బెడ్ రూం కాలనీని కలుపుతూ గెజిట్ విడుదల చేశారు. వాటి అభివృద్ధికి రూ.70 కోట్లు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

సీఎం రేవంత్‌రెడ్డికి ధన్యవాదాలు

జగిత్యాల, రాయికల్ మున్సిపాలిటీలకు ప్రభుత్వం నిధులు కేటాయించినందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ కృతజ్ఞతలు తెలిపారు. గురువారం వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా లింగం చెరువు వద్ద మొక్కలు నాటారు. నియోజకవర్గ పరిధిలోని జగిత్యాల, రాయికల్ మున్సిపాలిటీల అభివృద్ధికి రూ.85కోట్ల నిధులు మంజూరు అయ్యాయని తెలిపారు. విలీన గ్రామాల అభివృద్ధికి ఈ నిధులను వెచ్చించనున్నట్లు తెలిపారు. జిల్లా కేంద్రంలో త్వరలోనే అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణానికి కృషిచేస్తున్నానని, తాగునీటి కోసం ప్రత్యేకంగా రూ.36 కోట్ల పనులు జరుగుతున్నాయన్నారు. మున్సిపల్ కమిషనర్ స్పందన, మాజీ కౌన్సిలర్ శ్రీలత, సత్యం పాల్గొన్నారు.

రక్తమోడిన రహదారులు

- ఉమ్మడి జిల్లాలో వేర్వేరు చోట్ల రోడ్డు ప్రమాదాలు
- ఆరుగురు మృతి

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని రహదారులు గురువారం రక్తమోడాయి. మృతుల కుటుంబాల్లో తీవ్ర విషాదం నింపాయి. జగిత్యాల జిల్లా మల్యాల పరిధిలోని ముత్యంపేట వద్ద పెళ్లికారును డీసీఎం ఢీకొనడంతో చిన్నారి మృతి చెందగా.. పెళ్లి కుమారుడు సహా.. ఆరుగురు గాయపడ్డారు. ఇదే జిల్లా మల్లాపూర్ మండలం రాఘవపేట శివారులో ట్రాక్టర్ బోల్తాపడి తండ్రి మృతి చెందగా.. కొడుకు గాయపడ్డాడు. మెట్‌పల్లిలోని వెల్లుల్ల రోడ్డులో ఇసుక ట్రాక్టర్ ఢీకొని యువకుడు చనిపోయాడు. పెద్దపల్లి జిల్లా సుగ్లాంపల్లి వద్ద లారీ ఢీకొనడంతో దంపతులు చనిపోయారు. చిన్నారి గాయపడింది. కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ పరిధిలోని తుమ్మనపల్లి వద్ద రెండు లారీలు ఢీకొని ఒక డ్రైవర్ మృతి చెందగా.. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు.

-వివరాలు 10లో



జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రి వద్ద రోదనలు

నేటి నుంచి బడిబాట

- జిల్లా విద్యాశాఖ అధికారి రాము



డీఈవో రాము

జగిత్యాల: నేటి నుంచి ఈనెల 11 వరకు బడిబాట కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని డీఈవో రాము తెలిపారు. ప్రొఫెసర్ జయశంకర్ బడిబాటలో భాగంగా కలెక్టర్ ఆదేశాల మేరకు మండల ఎంఈవోలు, స్కూల్ కాంప్లెక్స్ హెడ్‌మాస్టర్ల ఆధ్వర్యంలో నేటి నుంచి బడిబాట కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. గ్రామసభతో ప్రారంభించుకుని 11న ముగించడం జరుగుతుందని, బడిబాట రిజిస్టర్ ఏర్పాటు చేసి అందులో వివరాలు నమోదు చేయాలన్నారు. సంబంధిత ఎక్సెల్‌లోని స్ప్రెడ్‌షీట్‌లో వివరాలు ఎంటర్ చేయాలన్నారు. ఉల్లాస్‌లో డ్రాపౌట్స్, నిరక్షరాస్యులను గుర్తించి సంబంధిత అధికారులకు సమాచారం ఇవ్వాలని, టెక్స్ట్ బుక్స్, నోట్‌బుక్స్, ఏకరూప దుస్తులు అందజేయాలని ఆదేశించారు. బడిబాటకు సంబంధించిన డాటాను రోజువారీగా అప్‌డేట్ చేయాలన్నారు. అందరి సహకారంతో బడిబాటను విజయవంతం చేసి 12న పండగ వాతావరణంలో తల్లిదండ్రులతో సమావేశం ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

క్లుప్తంగా

అప్పుల బాధతో ఆత్మహత్య


నాగరాజు(ఫైల్)

మల్యాల: అప్పుల బాధ భరించలేక ఇంటి నుండి వెళ్లిపోయిన వ్యక్తి వ్యవసాయ బావిలో శవమై తేలాడు. మల్యాల ఎస్సై నరేశ్ కుమార్ కథనం ప్రకారం.. నూకపల్లి డబుల్ బెడ్‌రూం ఇళ్లలో నివాసముంటున్న నాగరాజు (39) రూ.4లక్షల అప్పు కావడంతో, తీర్చే మార్గం కానరాక, బుధవారం ఇంటి నుంచి వెళ్లిపోయాడు. కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేయగా, గురువారం రాత్రి మల్యాల గ్రామ శివారులోని వ్యవసాయబావిలో శవమై తేలాడు. అప్పుల వాళ్లు ఎవరూ బాధ పెట్టవద్దని సూసైడ్ నోట్ రాసి, బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారని, కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

మెట్‌పల్లి: పట్టణంలోని దుబ్బవాడలో బెజ్జారపు తార ఇంట్లో దొంగతనం జరిగింది. ఎస్‌ఐ కిరణ్‌కుమార్ కథనం ప్రకారం.. తార బుధవారం ఇంటికి తాళం వేసి ఊరు వెళ్లింది. తిరిగి గురువారం రాగా, తాళం పగులగొట్టి ఉంది. లోపలికి వెళ్లి చూడగా..ఇంట్లో దాచి ఉంచిన తులం బంగారు పుస్తెల తాడు, మూడు గ్రాముల బంగారు విగ్రహం చోరీకి గురైనట్లు గుర్తించింది. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

పెళ్లింట విషాదం

- పెళ్లి బృందం కారును ఢీకొన్న డీసీఎం
- నాలుగు నెలల బాలుడు మృతి
- పెళ్లి కుమారుడితోపాటు ఆరుగురికి తీవ్ర గాయాలు
- జగిత్యాల జిల్లా ముత్యంపేట వద్ద ఘటన
- కరీంనగర్ జిల్లా హుజూరాబాద్‌లో నిలిచిపోయిన వివాహం


మృతిచెందిన నాలుగు నెలల బాలుడు రుద్ర


డ్రైవర్ చందు


చికిత్స పొందుతున్న శీతల్


తీవ్రంగా గాయపడిన దినేశ్

మల్యాల: తెల్లవారితే పెళ్లి.. ఓ పక్క అమ్మాయి ఇంట్లో అంతా సిద్ధం చేస్తుండగా.. పెళ్లి కొడుకు మండపానికి బయల్దేరాడు. ఎంతో సంబురంగా సాగుతున్న వారి ప్రయాణంలో ఒక్కసారిగా విషాదం నెలకొంది. పెళ్లి కొడుకు బృందం ప్రయాణిస్తున్న కారును మామిడికాయల లోడుతో వెళ్తున్న డీసీఎం ఎదురుగా ఢీకొంది. నాలుగు నెలల చిన్నారి మృతిచెందగా.. పెళ్లి కుమారుడితోపాటు ఆరుగురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన జగిత్యాల జిల్లా మల్యాల మండలం ముత్యంపేట శివారులో జగిత్యాల- కరీంనగర్ జాతీయ రహదారిపై గురువారం వేకువజామున చోటు చేసుకుంది. కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ మండలం బోర్నపల్లిలో వధువు ఇంట్లో జరగాల్సిన వివాహం నిలిచిపోయింది. పోలీసుల వివరాల ప్రకారం.. మహారాష్ట్రలోని నాందేడ్‌లోని చిక్కులవాడీలో నివాసముంటున్న మెట్‌కార్ హరి- లక్ష్మీబాయి దంపతుల కుమారుడు మహేశ్ వివాహం కరీంనగర్ జిల్లాలోని హుజూరాబాద్ బోర్నపల్లికి చెందిన సమీప బంధువు కంది నవ్యతో కుదిరింది. గురువారం వివాహం జరగాల్సి ఉండగా.. నాందేడ్ నుంచి పెళ్లి కొడుకు మహేశ్, అక్కాచెల్లెలు, బావతో కలిసి కారులో, తల్లిదండ్రులు, బంధువుల మరో రెండు డీసీఎం వ్యానుల్లో బుధవారం రాత్రి 8 గంటలకు బయల్దేరారు. జగిత్యాల జిల్లా మల్యాల మండలం ముత్యంపేట శివారులోకి రాగానే గురువారం వేకువజామున 3.30గంటల ప్రాంతంలో జగిత్యాల-కరీంనగర్ జాతీయ రహదారిపై కరీంనగర్ నుంచి జగిత్యాల వైపు మామిడికాయల లోడుతో వెళ్తున్న డీసీఎం కారును ఢీకొంది. కారు ముందుభాగం నుజ్జునుజ్జు కాగా, కారులో ప్రయాణిస్తున్న పెళ్లి కుమారుడు మహేశ్‌తోపాటు, అతని చెల్లెలు శీతల్, బావ దినేశ్, మరో అక్క మారుబాయి, సోనాలి, కారు డ్రైవర్ చందూ తీవ్రంగా గాయపడ్డారు. నాలుగు నెలల చిన్నారి రుద్ర చికిత్స పొందుతూ మృతి చెందాడు. మల్యాల ఎస్సై నరేశ్‌కుమార్ సంఘటనా స్థలానికి చేరుకొని, క్షతగాత్రులను 108లో జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.


రోడ్డు ప్రమాదంలో నుజ్జునుజ్జయిన పెళ్లిబృందం కారు

మరో మూడు నిమిషాలు ఆగి ఉంటే

మల్యాల అడ్డరోడ్డు నుంచి ప్రమాదం జరిగిన స్థలం కేవలం రెండు కిలోమీటర్ల దూరంలో ఉండగా, మరో మూడు నిమిషాలు ఆలస్యంగా బయలుదేరి ఉంటే, ప్రమాదం నుంచి బయటపడేవారని బంధువులు రోదించారు. పెళ్లి బృందం కారు మల్యాల అడ్డరోడ్డుకు చేరుకునేసరికి వేకువజామున సుమారు 3.30 అవుతుండగా, రెండు డీసీఎం వ్యానుల్లోని బంధువులు, రెండు కార్లలోని పెళ్లికుమారుడు, కుటుంబ సభ్యులు అడ్డరోడ్డు వద్ద టీ తాగి బయలుదేరిన మూడు నిమిషాలకు ప్రమాదం జరిగింది. రోడ్డు ప్రమాదంలో గాయపడిన పెళ్లికుమారుడు, కుటుంబ సభ్యులు ఆస్పత్రిలో చికిత్స పొంది, ఇంటిదారి పట్టడంతో హుజూరాబాద్‌లో జరగాల్సిన వివాహం నిలిచిపోవడంతో ఇరు కుటుంబాల్లో విషాదం చోటుచేసుకుంది.

పెళ్లికి వెళ్తూ.. మృత్యు ఒడికి

- రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలు మృతి
- వృద్ధురాలిని తప్పించబోయి దంపతులపైకి దూసుకెళ్లిన లారీ
- తీవ్ర గాయాలతో బయటపడిన మూడేళ్ల చిన్నారి


రాము, అనూష (ఫైల్)

సాక్షి పెద్దపల్లి: పెళ్లి ఇంటికి చేరుకోవాల్సిన దంపతులను లారీ రూపంలో వచ్చిన మత్యువు కబళించింది. జీవితంలోనే కాదు... మరణంలోనూ తమ బంధం విడదీయరానిదంటూ తిరిగిరాని లోకాలకు వెళ్లిపోయారు. వృద్ధురాలిని తప్పించబోయి, దంపతుల బైక్‌ను లారీ ఢీకొట్టిన ఘటన పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మున్సిపల్ పరిధిలోని సుగ్లంపల్లి వద్ద రాజీవ్ రహదారిపై గురువారం రాత్రి జరిగింది. ప్రమాదంలో దంపతులు మతిచెందగా, మూడేళ్ల కూతురు తీవ్ర గాయల పాలైంది. ఈ సంఘటనకు సంబంధించి ఎస్సై శ్రావణకుమార్ తెలిపిన వివరాల ప్రకారం పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలానికి చెందిన డ్రైవర్‌గా పనిచేస్తున్న గుంటిపల్లి రాము(30) భార్య అనూష (27), కూతురు సహస్ర(03)లు కలిసి హుజూరాబాద్ లోని బంధువుల పెళ్లికి వెళ్లడానికి ద్విచక్రవాహనంపై బయల్దేరారు. ఈ క్రమంలో సుగ్లాంపల్లి వద్దకు రాగానే పెద్దపల్లి వైపు వెళ్తున్న లారీకి వృద్ధురాలు అడ్డుగా రావడంతో లారీ డ్రైవర్ ఆమెను తప్పించబోయాడు. దీంతో లారీ డివైడర్ ఎక్కి ద్విచక్రవాహనాన్ని ఢీ కొట్టింది. ఈ ఘటనలో భార్య అనూష అక్కడిక్కడే మృతిచెందగా, భర్త సుల్తానాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా మృతిచెందాడు.. కూతురుకు తీవ్రగాయాలు కాగా మెరుగైన వైద్యం కోసం కరీంనగర్‌లోని ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. విషయం తెలుసుకున్న సీఐలు సుబ్బారెడ్డి, అనిల్లు అసుపత్రికి వచ్చి వివరాలను ఆడిగి తెలుసుకున్నారు.

బసంత్‌నగర్‌లో విషాదం

పాలకుర్తి: మరో రెండు రోజుల్లో బావమరిది వివాహం. ఎంతో సంబరంగా బయలుదేరిన భార్యాభర్తలు మార్గమధ్యంలో మృత్యువు కబలించడంతో బసంత్‌నగర్‌లో విషాదం నెలకొంది. తీవ్రంగా గాయపడ్డ చిన్నారి సహస్ర చావుబతుకులమధ్య వరంగల్ ఎంజీఎంలో పోరాడుతోంది. బసంత్‌నగర్‌లోని రాంనగర్‌కు చెందిన గుంటుపల్లి రాము స్థానికంగా లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. చిన్నప్పుడే తండ్రి కుమారస్వామి చనిపోగా, తల్లి పద్మ కాయాకష్టం చేసి కొడుకు రాము, బిడ్డ రమ్యను ఎంతో అల్లారుముద్దుగా పెంచింది. కొడుకు, కోడలు చనిపోయిన వార్త విన్న తల్లి పద్మ రోదనలు అక్కడున్నవారిని కంటతడిపెట్టించాయి.

లారీలు ఢీ.. ఒకరు మృతి

హుజూరాబాద్: ప్రమాదాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారుతున్న తుమ్మనపల్లి గ్రామం మీదుగా వెళ్తున్న వరంగల్-కరీంనగర్ జాతీయ రహదారిపై ఘోర రోడ్డు ప్రమాదం జరగగా.. ఒకరు మృతిచెందారు. మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు, పోలీసుల వివరాల ప్రకారం.. ప్రకాశం జిల్లా టంగుటూరు గ్రామానికి చెందిన దాచేపల్లి కృష్ణకిషోర్(44) లారీని ఎదురుగా వచ్చిన మరో లారీ ఢీకొట్టింది. కృష్ణకిశోర్ లారీ క్యాబిన్లో ఇరుక్కుపోయాడు. విషయం తెలుసుకున్న పోలీసులు చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. అతి కష్టమ్మీద క్షతగాత్రుడికి బయటికి తీసి చికిత్స నిమిత్తం హుజూరాబాద్ ప్రభుత్వాసుపత్రికి తరలించే లోపే మృతిచెందాడు. మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. లారీ క్లీనర్ మస్తాన్, మరో డ్రైవర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. రెండు లారీలు బ్రిడ్జిపై ఢీకొనగా.. అటు వరంగల్, ఇటు కరీంనగర్ వెళ్లే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పోలీసులు వాహనాలను దారి మళ్లించి ట్రాఫిక్ పునరుద్ధరించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాద స్థలాన్ని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్ పరిశీలించారు. ప్రమాదానికి గల కారణాలను సీఐ కరుణాకర్‌నడిగి తెలుసుకున్నారు.


లారీ క్యాబిన్‌లో ఇరుక్కున్న డ్రైవర్‌ను బయటికి తీసేందుకు ప్రయత్నిస్తున్న పోలీసులు, స్థానికులు

ట్రాక్టర్ బోల్తాపడి యువరైతు..


చెదలి ప్రవీణ్ మృతదేహం

మల్లాపూర్: వ్యవసాయ పనులకు వెళ్లి తిరిగి వస్తుండగా ట్రాక్టర్ బోల్తా పడి యువ రైతు మృతి చెందాడు. ఈ ఘటన జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండలం రాఘవపేట శివారులో గురువారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన చెదలి ప్రవీణ్(30)కు భార్య రమ్య, ఇద్దరు కొడుకులున్నారు. గ్రామశివారులోని తన వ్యవసాయ భూమిని చదును చేసేందుకు పెద్ద కుమారుడు శ్రీహాన్‌తో కలిసి వెళ్లాడు. పనులు ముగించుకుని తిరిగి ఇంటికి వస్తుండగా ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తాపడటంతో ప్రవీణ్ అక్కడికక్కడే మృతి చెందాడు. గాయపడిన శ్రీహాన్‌ను స్థానికులు మెట్‌పల్లి ఆసుపత్రికి తరలించారు. పోలీసులు ఘటనా స్థలంలో విచారణ చేపట్టారు. రమ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై రాజు తెలిపారు.


బోల్తా పడిన ట్రాక్టర్

ఇసుక ట్రాక్టర్ ఢీకొని యువకుడు..

మెట్‌పల్లి: పట్టణంలోని వెల్లుల్ల రోడ్డులో గురువారం రాత్రి ఇసుక ట్రాక్టర్ ఢీకొని బండలింగాపూర్‌కు చెందిన గుగ్గిళ్ల రవి మృతి చెందాడు. రవి ఇటీవలే ఇంటర్ పూర్తి చేశాడు. పని నిమిత్తం ద్విచక్ర వాహనంపై మెట్‌పల్లికి వచ్చి తిరిగి బండలింగాపూర్‌కు వెళ్తున్నాడు. మార్గమధ్యంలో పట్టణ శివారుకు చేరుకోగానే, ఎదురుగా వచ్చిన ఇసుక ట్రాక్టర్ ఢీకొట్టింది. తలకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మరణించాడు. మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు అక్కడికి చేరుకొని రోదించారు.


రవి(ఫైల్)

తండ్రిని హతమార్చిన తనయుడు

రాయికల్: రాయికల్ మండలం మైతాపూర్ గ్రామంలో తొట్ల ఎర్రయ్య(65)ను కన్న కొడుకే గొడ్డలితో దారుణంగా హతమార్చిన సంఘటన గురువారం చోటు చేసుకుంది. ఎస్సై సుధీర్‌రావు కథనం ప్రకారం.. జగిత్యాల జిల్లా రాయికల్ మండలం మైతాపూర్ గ్రామంలో తొట్ల ఎర్రయ్య కొడుకు మల్లేశ్‌తో కలిసి జీవిస్తున్నాడు. చిన్నప్పుడే తల్లి చనిపోగా.. మల్లేశ్ మానసిక పరిస్థితి సరిగా లేదు. కొడుకు ఆలన పాలన తండ్రి ఎర్రయ్య చూసుకుంటున్నాడు. మానసిక స్థితి సరిగా లేని మల్లేశ్ బుధవారం అర్ధరాత్రి తన తండ్రిపై గొడ్డలితో తీవ్రంగా దాడిచేయగా అక్కడికక్కడే మృతిచెందాడు. సంఘటన స్థలాన్ని జగిత్యాల రూరల్ సీఐ కృష్ణారెడ్డి సందర్శించారు. సంఘ నాయకుడు నాగుల గంగ మల్లయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.


తొట్ల ఎర్రయ్య మృతదేహం

పోలీస్‌స్టేషన్ ఎదుట పెట్రోల్ పోసుకున్న వ్యక్తి

- హైరానా పడ్డ పోలీసులు

జగిత్యాలక్రైం: జగిత్యాల పట్టణ పోలీస్‌స్టేషన్ ఎదుట ఓ వ్యక్తి మద్యంమత్తులో పెట్రోల్ పోసుకుని హంగామా సృష్టించాడు. పాత బస్టాండ్ ప్రాంతంలో అరటి పండ్లు అమ్ముకునే వ్యక్తి గురువారం సాయంత్రం అతిగా మద్యం సేవించి పెట్రోల్ బాటిల్‌తో పోలీస్‌స్టేషన్‌కు వచ్చాడు. శరీరంపై పెట్రోల్ పోసుకుని హంగామా చేశాడు. అక్కడే ఉన్న పోలీసులు పెట్రోల్ బాటిల్ లాక్కొని అతని అదుపు చేసేందుకు ప్రయత్నించారు. పారిపోయేందుకు ప్రయత్నించగా అడ్డుకున్నారు.


పోలీస్‌స్టేషన్‌లో హంగామా చేస్తున్న వ్యక్తి

ఎస్సెస్సీ బోర్డు తప్పిదం.. విద్యార్థినికి అన్యాయం

- రీ వెరిఫికేషన్‌లో 20 మార్కులు పెంపు

రామగిరి(మంథని): ఎస్సెస్సీ బోర్డు అధికారుల తప్పిదంతో విద్యార్థినికి అన్యాయం జరిగింది. రామగిరి మండలం బేగంపేటకు చెందిన సిరిపురం వర్షిత సెంటినరికాలనీలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో పదో తరగతి చదివింది. వార్షిక పరీక్షల్లో 567 మార్కులు సాధించింది. చదువులో మొదటి స్థానంలో ఉండే వర్షిత తనకు వచ్చిన మార్కుల పట్ల సంతృప్తి చెందక బోర్డు అధికారులకు రీ వెరిఫికేషన్ కోసం దరఖాస్తు చేసుకుంది. బోర్డు ఆదేశాలతో మరోసారి పరిశీలించగా అసలు తప్పిదం బయటపడింది. పార్ట్-బీ పేపర్ కౌంట్ చేయలేదని గుర్తించి ఇప్పుడు 20 మార్కులు కలిపి మొత్తం 587 మార్కులుగా బోర్డు నుంచి మార్కుల మెమో అందజేశారు. రీ వెరిఫికేషన్‌లో 20 మార్కుల పెంపుతో వర్షిత జిల్లా స్థాయిలో ద్వితీయ స్థానం సాధించింది. అధికారుల తప్పిదం వల్ల తమ బిడ్డకు తీవ్ర అన్యాయం జరిగిందని వెంటనే బోర్డు అధికారులపై చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.


వర్షిత

కొండగట్టులో విజిలెన్స్ తనిఖీలు

మల్యాల: ప్రముఖ పుణ్యక్షేత్రం కొండగట్టులో విజిలెన్స్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. లడ్డూ, ప్రసాదాల తయారీలను పరిశీలించారు. లడ్డు తయారీ విధానం, లడ్డుల సామగ్రి, రికార్డులు, లడ్డు బరువు పరిశీలించారు. అనంతరం ఆలయ కార్యాలయానికి వెళ్లి, 2023- 24లో టెండర్లలో అవకతవకలపై ఆరా తీశారు. ఈ మేరకు టెండర్ల రికార్డులు ఇవ్వాలని కోరగా, ఈఓ శ్రీకాంత్‌రావు అందుబాటులో లేరని అధికారులు చెప్పడంతో ఈఓతో ఫోన్‌లో మాట్లాడగా, తాను వచ్చిన తర్వాత టెండర్ల రికార్డులు అందజేస్తామని సమాధానం చెప్పినట్లు తెలిసింది. గతంలో టెండర్ల గోల్‌మాల్‌తో పాటు, ఆలయంలో జరిగిన వెండి, బంగారం దొంగతనంపై ఆరా తీసినట్లు తెలిసింది.

రాష్ట్ర ఉత్తమ పంచాయతీగా చామనపల్లి

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం చామనపల్లి గ్రామ పంచాయతీ రాష్ట్రస్థాయిలో ఉత్తమ పంచాయతీగా అవార్డు సాధించింది. ప్రపంచ పర్యావరణ దినోత్సవం పురస్కరించుకుని గురువారం హైదరాబాద్‌లోని తెలంగాణ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో దేవాదాయ, పర్యావరణ, అటవీశాఖ మంత్రి కొండా సురేఖ చేతుల మీదుగా పంచాయతీ కార్యదర్శి కోరుకంటి మహేందర్‌రావు ఉత్తమ పంచాయతీ అవార్డు, ప్రశంసాపత్రం అందుకున్నారు. రాష్ట్రస్థాయిలో ఈ అవార్డు కోసం మూడు గ్రామపంచాయతీలు ఎంపిక చేయగా చామనపల్లి పంచాయతీకి మొదటి స్థానం లభించింది. సాలీడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్, స్వచ్ఛత, పర్యావరణం, పచ్చదనం. సెగ్రేషన్‌షెడ్, కంపోస్టు ఎరువుల తయారీ, విటమిన్ గార్డెన్, ప్లాంటేషన్, కమ్యూనిటీ సోక్ పిట్స్ తదితర అంశాల్లో చామనపల్లి పంచాయతీ అత్యుత్తమ ప్రతిభను ప్రదర్శించి మొదటిస్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా గ్రామ ప్రత్యేక అధికారి, ఎంపీవో సీహెచ్.జగన్మోహన్‌రెడ్డి, కార్యదర్శి మహేందర్‌రావు, పంచాయతీ సిబ్బందిని మంత్రి సురేఖ అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ సెక్రటరీ అహ్మద్ నదీమ్, టీఎస్ పీసీబీ మెంబర్ సెక్రటరీ రవి తదితరులు పాల్గొన్నారు.


మంత్రి సురేఖ నుంచి సర్టిఫికెట్ అందుకుంటున్న కార్యదర్శి మహేందర్‌రావు

కిడ్నాప్ కథ సుఖాంతం

- పోలీసుల అదుపులో కిడ్నాపర్లు
- రూ.30లక్షల కోసమే వృద్ధుడి అపహరణ
- చాకచక్యంగా కాపాడిన పోలీసులు

ముస్తాబాద్(సిరిసిల్ల): రాజన్నసిరిసిల్ల జిల్లాలో కలకలం సృష్టించిన వృద్ధుడి కిడ్నాప్ కథ సుఖాంతమైంది. సోమవారం రాత్రి కిడ్నాపర్లు అపహరించుకుపోగా.. బుధవారం కోరుట్లలోని ఓ ఇంట్లో దాచి ఉంచిన వృద్ధుడిని కాపాడి, మరో ముగ్గురిని పోలీసులు పట్టుకున్నారు. కిడ్నాప్‌లో ప్రధాన సూత్రదారులు ఇద్దరిని గురువారం అదుపులోకి తీసుకున్నారు. ముస్తాబాద్ ఎస్సై చిందం గణేశ్ తెలిపిన వివరాలు. ముస్తాబాద్ మండలం గూడూరుకు చెందిన జంపెల్లి మల్లయ్య (72)ను గత సోమవారం గుర్తుతెలియని వ్యక్తులు కిడ్నాప్ చేశారని భార్య మలవ్వ ఫిర్యాదు చేసింది. ఈమేరకు పోలీసులు విచారణ చేపట్టారు. సాంకేతిక ఆధారాల ద్వారా కిడ్నాపర్లు కోరుట్లలో ఉన్నట్లు గుర్తించారు. అక్కడి ఓ ఇంట్లో కిడ్నాపర్ల చెరలో ఉన్న మల్లయ్యతోపాటు ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. వారిని విచారించగా.. మల్లయ్య కుమారుడు జంపెల్లి పర్శరాములుకు దుబాయ్‌లో కోనరావుపేట మండలం మల్కపేటకు చెందిన బోయిని రాజేందర్ రూ.30లక్షలు ఇచ్చాడని, అడిగితే ఇవ్వడం లేదని తెలిపారు. డబ్బుల కోసం గూడూరుకు వచ్చిన రాజేందర్‌కు పర్శరాములు దొరక్కపోవడంతో ఆయన తండ్రి మల్లయ్యను అపహరించినట్లు అంగీకరించారు. బోయిని రాజేందర్‌తోపాటు అతనికి సహకరించిన మర్తనపేటకు చెందిన కలకోట రవి, సిరిసిల్లకు చెందిన సండడికాడి సతీశ్, కారుడ్రైవర్ సుమన్‌లపై కేసు నమోదు చేశారు. రాజేందర్‌తోపాటు కలకోట రవి, సతీశ్‌లను రిమాండ్‌కు తరలించారు. మరో నిందితుడు డ్రైవర్ సుమన్ పరారీలో ఉన్నారు. కిడ్నాపర్లను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన కానిస్టేబుళ్లు రాజశేఖర్, ఖాసీంలను ఎస్సై అభినందించారు.

ఉద్యమనేతల మాటముచ్చట

ముస్తాబాద్(సిరిసిల్ల): ప్రజాసమస్యలపై అలుపెరగని పోరాటాల నేపథ్యం వారిది. ఒకరు పాటతో చైతన్యం కలిగిస్తే.. మరొకరు బోధనలతో ఉద్యమాన్ని ఉవ్వెత్తున లేపారు. బడుగు, బలహీనవర్గాల తరఫున నేనున్నానంటూ పిడికిలి ఎత్తిన నేత మరొకరు.. వీరందరూ గురువారం ఒక్కచోట చేరారు. రాజన్నసిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలం ఆవునూర్‌లో సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు కుమారుడు అభిలాశ్ -శివాని వివాహం జరిగింది. ఈ పెళ్లికి సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, ఎమ్మెల్సీలు కోదండరాం, నెల్లికంటి సత్యం, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, జనశక్తి అగ్రనేత అమర్, విమలక్క, మాజీ ఎమ్మెల్యే చలపతిరావు, జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ తుల ఉమ, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌లు పెళ్లి మండపంలో కలుసుకున్నారు. కుశలప్రశ్నలు వేసుకుంటూ గడిపారు.


సీపీఐ ఎమ్మెల్యే సాంబశివరావు, ఉద్యమనేతలు అమర్, చలపతిరావుల పలకరింపులు

పాలిటెక్నిక్ కోర్సుల్లో ప్రవేశాలు

కరీంనగర్ అర్బన్: పీవీ నరసింహారావు తెలంగాణ పశువైద్య విశ్వవిద్యాలయంలో 2025-26 విద్యా సంవత్సరానికి గాను రెండు సంవత్సరాల పాలిటెక్నిక్ కోర్సు ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదలచేశారని కరీంనగర్ పశుసంవర్ధక పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ రమేశ్ తెలిపారు. కోర్సులో ప్రవేశం కొరకు పదోతరగతి లేదా దానికి సమానమైన పరీక్షలో ఉతీర్ణులై (టీజీ పాలిసెట్ 2025) ఎంబైపీసీలో ర్యాంకుపొంది ఉండాలని పేర్కొన్నారు. ఈ యూనివర్సిటీ పరిధిలో మూడు పశుసంవర్ధక పాలిటెక్నిక్ కళాశాలలు కరీంనగర్, సిద్దిపేట, మహబూబ్‌నగర్ జిల్లాలో మొత్తం 99 సీట్లు ఉన్నాయని వివరించారు. కోర్సుల్లో చేరడానికి ఆసక్తిగల విద్యార్థులు విశ్వవిద్యాలయం వెబ్‌సైట్‌లో అప్లికేషన్ డౌన్లోడ్ చేసుకొని ఈ నెల 24 సాయంత్రం 5గంటల లోపు విశ్వవిద్యాలయంకు దరఖాస్తు చేయవచ్చని విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ శరత్ చంద్ర తెలిపారు. ప్రభుత్వ రంగంలో వెటర్నరీ అసిస్టెంట్, ప్రైవేటు రంగంలో డెయిరీ ఫార్మ్, పౌల్ట్రీ ఫార్మ్, పెట్ హాస్పిటల్‌లో ఉపాధి అవకాశాలు మెండుగా ఉన్నాయని వివరించారు.

'లక్కీ' లాటరీ మోసాలపై స్పందించండి

- నివేదిక ఇవ్వాలని సీపీకి హెచ్‌ఆర్సీ ఆదేశాలు

సాక్షిప్రతినిధి,కరీంనగర్: లక్కీలాటరీ మోసాలపై ఎట్టకేలకు మానవ హక్కుల కమిషన్ (హెచ్ఆర్సీ) స్పందించింది. కరీంనగర్ వేదికగా పలుకంపెనీలు కరీంనగర్, సిరిసిల్ల, జగిత్యాలలోని మైనార్టీలను లక్ష్యంగా చేసుకుని లక్కీ లాటరీలు నడిపి ప్రజలను మోసం చేసిన సంగతి తెలిసిందే. ఈ విషయాన్ని 2022 అక్టోబరులో 'లక్కీ లాటరీ మోసాలు' శీర్షికన సాక్షిలో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. ఉచిత బహుమతులు, నగదు బహుమతులు ఇస్తామంటూ పేదలకు ఆశచూపించి వారి నుంచి రూ.కోట్లు కాజేసి పరారయ్యారు. ఈ విషయంలో పోలీసులు సరిగా వ్యవహరించలేదన్న విమర్శలు ఉన్నాయి. దీంతో కరీంనగర్‌కు చెందిన ఇమ్రాన్ అనే యువకుడు మానవ హక్కుల కమిషన్‌ని ఆశ్రయించాడు. దీంతో జరిగిన ఘటనపై ఈనెల 24వ తేదీలోగా పూర్తిస్థాయి నివేదిక ఇవ్వాలని కరీంనగర్ సీపీకి హెచ్ఆర్సీ ఆదేశించింది.

రాజన్న గోశాలలో మరో రెండు కోడెలు మృతి

వేములవాడఅర్బన్: శ్రీరాజరాజేశ్వరస్వామి దేవస్థానం తిప్పాపూర్‌లోని గోశాలలో గురువారం అనారోగ్యంతో మరో రెండు కోడెలు మృతిచెందినట్లు జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి రవీందర్‌రెడ్డి ప్రకటనలో తెలిపారు. అకాలవర్షాలు, అనారోగ్య పరిస్థితులతో గోశాలలో ఇప్పటి వరకు 28 కోడెలు మృతి చెందినట్లు వివరించారు. గోశాలలో ఉన్న 1,300 కోడెలలో ప్రస్తుతం 12 కోడెలు అనారోగ్యంతో బాధపడుతున్నట్లు తెలిపారు. వీటికి వెటర్నరీ డాక్టర్లు వైద్యం అందిస్తున్నట్లు పేర్కొన్నారు.

దాణాపూర్ ఎక్స్‌ప్రెస్ నుంచి కిందపడిన యువకుడు

ఓదెల(పెద్దపల్లి): సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలునుంచి కిందపడిన యువకుడు అదృష్టవశాత్తు ప్రాణాలతో బయటపడ్డాడు. వివరాలు.. గురువారం గోదావరిఖనికి చెందిన కంకణాల సంతోష్ రామగుండం వచ్చేందుకు కాజీపేట్‌లో దాణాపూర్ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కి డోర్ వద్ద కూర్చున్నాడు. పొత్కపల్లి రైల్వేస్టేషన్ సమీపంలో ప్రమాదవశాత్తు కిందపడగా తీవ్రంగా గాయపడి స్పృహ కోల్పోయాడు. బ్లూకోల్ట్ పోలీసులు శంకర్, శివశంకర్ వెంటనే స్పందించి పట్టాల మధ్య ఉన్న సంతోష్‌ను బయటకు తీసుకువచ్చి అంబులెన్స్‌లో సుల్తానాబాద్ ఆస్పత్రికి తరలించారు.


గాయపడిన సంతోష్

పత్రిక ప్రకటన

ఇందుమూలముగా సమస్త ప్రజలకు తెలియజేయునది ఏమనగా నాయొక్క క్లయింటు కస్తూరి విజయలక్ష్మి, W/O రాజేంధర్, R/o. రాయికల్ గ్రామం & మండలం గారు ఆమె యొక్క వారసత్వం క్రింద సంక్రమించిన ఉమ్మడి కుటుంబంనకు చెందిన భూములు సర్వే నంబర్ 755 లో ఎ 1-28 గుం., 756 లో 0-10 గుం., 789లో 0-23 గుం., మరియు ఇల్లు నంబర్లు 26-2, 3-91 మరియు 16-15 (10-19 పాతది) & 16-17 రాయికల్ గ్రామ శివారులలో గల వాటిపై తన యొక్క వాటా కొరకు గుట్ట యెతిరాజం, గుట్ట మహేష్, గుట్ట మధుసూదన్ మరియు గుట్ట లక్ష్మీనారాయణ గార్లపై గౌరవనీయ ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జ్ కోర్టు జగిత్యాల నందు O.S. No. 35/2021 ద్వారా కేసు వేసినారు. ప్రస్తుతం ఇట్టి కేసు కోర్టులో పెండింగులో కలదు.

ఇట్టి పై విషయాలు కప్పిపుచ్చుతూ గుట్ట యెతిరాజం, గుట్ట మహేష్, గుట్ట మధుసూదన్ మరియు గుట్ట లక్ష్మీనారాయణ గార్లు ఇతర వ్యక్తులకు నాయొక్క క్లయింటుకు చెందిన వాటా భూములను పంపకం జరగకుండా కోర్టులో కేసు పెండింగులో ఉండగా అక్రమంగా అమ్ముటకు ప్రయత్నించుచున్నట్టుగా తెలిసినది. కావున పై భూమిపై పై వ్యక్తులతో ఎవ్వరు ఎలాంటి లావాదేవీలు చేయకూడదని ఒకవేళ చేసిన వారికి చట్ట ప్రకారంగా ఎలాంటి హక్కులు సంక్రమించవని మరియు నాయొక్క క్లయింటు తీసుకొనబడబోయే అన్ని చర్యలకు బాధ్యులు కాగలరని ఇందుమూలముగా తెలియపరచనైనది.

సం/- కె. నర్సయ్య, అడ్వకేట్
జగిత్యాల